క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో మార్గశిర మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం,బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ప్యాపిలి: మండల పరిధిలోని బూరుగల ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన కాటంరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి సోమవారం మైక్‌సెట్ విరాళంగా ఇచ్చారు. కాటంరెడ్డి కుమారుడు జగదీశ్ రెడ్డి బూరుగల పాఠశాలలో చదువుతున్నాడు. పాఠశాలలో మైక్‌సెట్ లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని మైక్‌సెట్, కార్డ్‌లెస్ మౌత్‌పీసులు విరాళంగా ఇచ్చినట్లు దాత తెలిపాడు. హెచ్‌ఎం మెర్సి జూలియా కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యురాలితో చర్చిస్తున్న కమిషనర్, చైర్మన్

బేతంచెర్ల: అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను వారు సందర్శించారు. సెంటర్‌లో నెలకొన్న సమస్యలు, సౌకర్యాలపై వైద్యురాలు తస్లీమాతో చర్చించారు. కాంపౌండ్‌వాల్ నిర్మాణం, త్రీఫేస్ విద్యుత్, పైపులైన్ ఏర్పాటు చేయాలని వైద్యురాలు కోరగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు.

చెన్నుపాటి ఆశయ సాధనకు కృషి చేద్దాం

ప్యాపిలి: ఉపాధ్యాయ ఉద్యమ నేత అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అబ్దుల్ లతీఫ్ అన్నారు. సోమవారం ప్యాపిలిలో చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల విద్యాసంస్థల ఉపాధ్యాయులను ఒకే యూనియన్‌గా మార్చడానికి చెన్నుపాటి లక్ష్మయ్య కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను స్థాపించి ఆ సంఘానికి ఆయన అధ్యక్షుడిగా కూడా ఎన్నికైనట్లు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు మధు, చంద్రమోహన్, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక.. ఏకగ్రీవం

కోవెలకుంట్ల: విజయ పాలడెయిరీకి సంబంధించి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షులుగా కోవెలకుంట్ల మండలంలో ఇద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లింగాల, భీమునిపాడు గ్రామాల్లో సహకార సంఘం ఎన్నికకు ఈ నెల 31వ తేదీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సోమవారం నామినేషన్ల స్వీకరణకు ఆఖరి రోజు కావడంతో ఆయా గ్రామాల్లో ఒక్కొక్కరి నుంచే నామినేషన్లు దాఖలయ్యాయి. లింగాల స్థానానికి దూదేకుల ఉసేనయ్య, భీమునిపాడు స్థానానికి సునీల్‌రెడ్డి నామినేషన్లు వేశారు. రెండు అధ్యక్ష స్థానాలకు ఒక్కరు చొప్పునే నామినేషన్లు రావడంతో రెండు స్థానాలు దాదాపు ఏకగ్రీవమయ్యాయి. విజయ డెయిరీ సూపర్‌వైజర్లు నాగన్న, శరత్‌రెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి రైతు వర్రీ

- ప్రారంభమైన వరికోతలు
- అమలు కాని కనీస మద్దతు ధర
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో 28వేల ఎకరాల్లో వరి సాగు
- గతేడాది కన్నా తగ్గిన ధరలు
- ఆందోళన చెందుతున్న వరి రైతులు

బనగానపల్లె నియోజకవర్గంలో వరిసాగు వివరాలు

మండలం	రైతు సేవా కేంద్రాలు	ఎకరాలు
అవుకు	18	11814
బనగానపల్లె	25	8895
కోవెలకుంట్ల	10	3704
సంజామల	11	3429
కొలిమిగుండ్ల	13	810



అవుకులో మిషన్ ద్వారా వరి కోతలు

అవుకు: ధాన్యం ధరలు రైతులను కలవరపెడుతున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు కనీస మద్దతు ధర లభించకపోవడంతో దిగులు చెందుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమయ్యాయి. వరి దిగుబడి బాగున్నా పెట్టుబడులు పెరగడం, ధాన్యాన్ని కొనేవారు లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా దళారులు రంగంలోకి దిగుతున్నారు. రైతుల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు రైతులు వారి చెప్పిన ధరలకే విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో 28.65 ఎకరాల్లో వరిసాగు

బనగానపల్లె నియోజకవర్గంలోని 77 రైతు సేవా కేంద్రాల పరిధిలో 28,652 ఎకరాల్లో కర్నూలు సోనా, 555, నంద్యాల సోనా లాంటి రకాల వరి పంటలు సాగు చేశారు. నారుమడి నుంచి వరినాట్లు, పాయలు, ఎరువులు, మందులు, కలుపులు, కోతలతో ఎకరాకు రూ.35 నుంచి రూ.40 వేలు పెట్టుబడి ఖర్చులు వచ్చాయి. కొందరు కోతల సమయంలోనే ధాన్యాన్ని విక్రయించేస్తున్నారు. 75 కేజీల వరి బస్తా రూ.1400 నుంచి రూ.1450 మాత్రమే పలుకుతుండడంతో కష్టానికి ప్రతిఫలం ఏదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికి మద్దతు ధర ప్రకటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

రైతుల ఆందోళన

నెల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధాన్యం ధర ఇప్పుడు అమాంతంగా పడిపోయింది. దీంతో రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఏటా ధాన్యాన్ని కొనడానికి వ్యాపారులు వెంట పడేవారు. అయితే ఈ ఏడాది రైతులే పంటను అమ్ముకోవడానికి తంటాలు పడాల్సిన పరిస్థితి. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బనగానపల్లె నియోజకవర్గంలో 77 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అయితే కూటమి ప్రభుత్వం ఇంత వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కోత కోసిన వరి ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలో తెలియక సతమతమవుతున్నారు. కొందరు తక్కువ ధరకే వ్యాపారులకు విక్రయించేస్తున్నారు. వ్యాపారులు 75 కేజీల కర్నూలు సోనా వరి బస్తాను కేవలం రూ.1400కే , నంద్యాల సోనా రూ.1500కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా రైతన్నల పక్షాన నిలబడింది. పంటల సాగుకు పెట్టుబడి సాయంగా నేరుగా రైతుల ఖాతాలో నగదును జమ చేసింది. నష్టం వస్తే పరిహారాన్ని వెంటనే అందజేసి ఆదుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వరి ధరలు పలికాయి. గత ఏడాది 75 కేజీల కర్నూలు సోనా రూ.2వేల నుంచి రూ.2200 పలికింది. 75 కేజీల నంద్యాల సోనా రూ.2800 వరకు పలికింది. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతన్నల ఇంట సంతోషాల పంటగా ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లభించక రైతులు అల్లాడుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు



అవుకు మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పలుచోట్ల రైతులు పంటను కోతలు కోసి మిల్లులకు తరలించారని తెలిసింది. ప్రభుత్వం నుంచి గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలపై ఇంత వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

–అబ్దుల్ హక్, వ్యవసాయాధికారి

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



అవుకులో 3.5 ఎకరాల్లో వరి పంట ను సాగు చేశాను. ప్రస్తుతం కోతకు వచ్చింది. మరో నాలుగు రోజుల్లో మిషన్ ద్వారా నూర్పిడి పనులు మొదలు పెడతాను. అయితే ధరలు చేస్తే ఆందోళగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే తక్కువ ధరలు ఉన్నాయి. ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

–బుగ్గ సుబ్రమణ్యం, రైతు, అవుకు

గిట్టుబాటు ధర కల్పించాలి



అవుకు పరిధిలో 16 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇప్పటికే ఆరు ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. వర్షాలు వస్తాయనే భయంతో గిట్టుబాటు ధర లేకపోయినా కోసిన పంటను వెంటనే ప్రైవేటు వ్యాపారులకు బస్తా రూ.1450 చొప్పున అమ్మేశాను. ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

–అనపూరి సురేష్, రైతు, అవుకు

ఆందోళనగా ఉంది



మెట్టుపల్లె గ్రామంలో 4.5 ఎకరాల్లో నంద్యాల సోనా వరి సాగు చేశా. ఎకరాకు సుమారు రూ.35 వేల పెట్టుబడి ఖర్చు అయింది. ఇంకా నూర్పిడి చేయాల్సి ఉంది. గతంలో ఈ రకం సోనా బస్తా రూ.2800 పలికింది. అయితే ఈ ఏడాది రూ.1500లకే వ్యాపారులు అడుగుతున్నారు. నష్టపోతానని ఆందోళనగా ఉంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మా లాంటి రైతులు గట్టెక్కగలుగుతారు.

–అనముల వెంకట సుబ్బయ్య, రైతు, అవుకు

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఇండోర్‌స్టేడియం సమీపంలోని ఓ భవనంలో ఆరుగురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేకముక్కలు, రూ. 5,800 నగదు స్వాధీనం చేసుకుని పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

నేడు కిశోరి వికాసం కార్యక్రమం

సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో వెంకటాపురం, ఎల్‌బండ ఫీడర్లకు సంబంధించి 11 కేవీ లైన్ మార్పు పనుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అబ్బిరెడ్డిపల్లె, బొంతిరాళ్ల, వెంకటాపురం, గుమ్మకొండ, ఉడుములపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాలకు త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి 2 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

నేడు ఆకుమల్లలో రెవెన్యూ సదస్సు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు భూ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా



ఉన్నతాధికారుల ఆదేశాలలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అర్చకులు (ఫైల్)



దేవుని మాన్యంలో అక్రమార్కులు తొలగించిన హెచ్చరిక బోర్డు

- ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తొలగింపు
- యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- పట్టించుకోని అధికారులు

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినా తరువాత మైనింగ్ మాఫియా ఆగడాలకు హద్దులేకుండా పోయింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు హెచ్చరిక బోర్డులు వేసినా లెక్కపెట్టడం లేదు. బోర్డులను తొలగించి యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 308లో సుమారు 4 ఎకరాల భూమిలో విలువైన నాపరాయి ఉంది. ఇక్కడ ఆలయ అర్చకులు భాస్కరయ్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. మైనింగ్ మాఫీయా రెండు రోజుల క్రితం హెచ్చరిక బోర్డును తొలగించింది.



వెలికి తీసేందుకు సిద్ధం చేసిన నాపరాయి

అక్కడ శుభ్రం చేసి నాపరాయి వెలికి తీసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ అర్చకులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే రెవెన్యూ అధికారుల గాని మైనింగ్ అధికారులు గానీ కన్నెత్తి చూడడం లేదు. దీంతో మైనింగ్ మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. దీనిపై ఆలయ గ్రూపు టెంపుల్ ఈఓ బ్రహ్మానందరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్‌ను సాక్షి ప్రతినిధి ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించినా వారు స్పందించలేదు.

డోన్ అభివృద్ధిపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు



మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ, జెడ్పీటీసీ

డోన్: దశాబ్దాల కాలంగా డోన్ నియోజకవర్గం నుంచి అనేక మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించినా, ముఖ్యమంత్రులుగా పనిచేసినా ఈ ప్రాంతం ఎందుకు వెనుకబడిందో ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ నాయకులకు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు సవాల్ చేశారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోస్టుప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో డోన్ అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకులు పేర్కొనడం సిగ్గుచేటన్నారు.

మూడేళ్లలో రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు

డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.3,500 కోట్లతో డోన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. రూ.700 కోట్లతో తమ్మరాజుపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్‌కు నేషనల్ హైవే నిర్మాణం, రూ.300 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించే పనులు, రూ.210 కోట్లతో హంద్రీ-నీవా కాల్వ నుంచి నియోజకవర్గంలోని చెరువులను నింపే కార్యక్రమం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

పేదరికాన్ని పారద్రోలాం

నియోజకవర్గ ప్రజలను ముఠాకక్షల ఊబిలో కూరుకుపోయేలా చేసి కట్టుబానిసలుగా తమ వెంట తిప్పుకున్న టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించే అర్హత లేదన్నారు. రూ.12 కోట్లతో రైల్వేగేట్ల కింద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు చేపట్టకుండా అడ్డుకున్నది ఎవరో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం స్థల సేకరణ, కమిటీ ఏర్పాటు లాంటి అన్ని ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించి క్యాబినెట్ ఆమోదం పొందేందుకు కృషి చేసిన బుగ్గన గురించి విమర్శించే స్థాయి టీడీపీ నాయకుడు వలసల రామక్రిష్ణకు లేదన్నారు. డోన్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మాజీ మంత్రి తీర్చిదిద్దిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు.

వలస పక్షి గురించి అందరికీ తెలుసు

పదవుల కోసం ఏ ఎండకాగొడుగు పట్టే రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వలసల రామక్రిష్ణ చరిత్ర నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. నమ్మిన వారిని నట్టేట ముంచడం, రాజకీయంగా ఎదిగిన తర్వాత అందుకు కారణమైన వారిని విస్మరించడం, సొంత ప్రయోజనాల కోసం ఎలాంటి నీచ పనులకైనా దిగజారడం ఆయన నైజమని విమర్శించారు.

జీర్ణించుకోలేకపోతున్నారు

మూడేళ్ల పాటు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ కృషితో కేంద్రీయ విద్యాలయం మంజూరైందన్నారు. తమతో పాటు బీజేపీ నేతలు బుగ్గనకు కృతజ్ఞత తెలుపుతూ ర్యాలీ నిర్వహించడాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు పాలుట్ల రఘురాం, ఆర్ట్ రమణ, ఫారెస్ట్ మౌలాలి, వంశీ, నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, నాగిరెడ్డి, మహేంద్ర, వెంకటేష్, ప్రకాష్, కోఆప్షన్ సభ్యుడు పాతపేట రఫి తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవతోనే మానవ జన్మకు సార్థకత



రోగులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజ సేవతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని వైద్యురాలు సాగరిక అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఉపేంద్ర, వలిబాషా, మనోహర్ రెడ్డి, స్వామి నాయుడు, శివలింగప్ప పాల్గొన్నారు.

కాసాపురానికి పాదయాత్ర



ఇరుముడులతో బయలుదేరుతున్న మాలధారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో కాసాపురం నెట్టికంటి వీరాంజనేయస్వామి మాల ధరించిన భక్తులు ఇరుముడులను సమర్పించేందుకు సోమవారం గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ముందుగా గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, సింధూర అర్చన, మహా మంగళహారతి నిర్వహించారు.

సంగమేశ్వర శిఖరానికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో క్రమేపి నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. సోమవారం జలాశయం నీటి మట్టం 864 అడుగులకు చేరుకుంది. దీంతో మండలంలోని సప్తనదీ సంగమ ప్రాంతంలో జాలాధివాసంలో ఉన్న ప్రాచీన సంగమేశ్వరాలయ శిఖరభాగం బయపడుతోంది. సోమవారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ శిఖరభాగానికి ప్రత్యేక పూజలు చేశారు. శిఖరభాగంపై పరమేశ్వరుడి ప్రతిమను ఉంచి కుంకుమార్చన, పుష్పార్చన, నదీజలాలతో అభిషేకం, మహా మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదినం

కోవెలకుంట్ల: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలుయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు బాలన్న, సత్యం, ఓబులేసు, బాలయ్య, మల్లికార్జున, రమేష్‌కుమార్, రామచంద్రుడు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో బిల్లులు



చీనీ మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కలు నాటుకుంటున్న రైతులకు ప్రతి నెలా బిల్లు చెల్లించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎం.పేండేకల్లు, మర్రికుంట, రేపల్లె గ్రామాల్లో చీని, నిమ్మ, మామిడి మొక్కలను పరిశీలించారు. మొక్కల సంరక్షణకు ప్రతి నెలా బిల్లులు ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు సూచించారు. ఆయన వెంట ఏపీఓ శేషన్న, ఈసీ సుబ్బానాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లస్వామి, రైతు రాజగోపాలురెడ్డి పాల్గొన్నారు.

సారా బట్టీల ధ్వంసం

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకులపల్లె గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు వర్ధనాదేవి, కృష్ణ సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలో 2 సారా బట్టీలను ధ్వంసం చేసి 2,200 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. నిల్వ ఉంచిన 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐలు కమలాకర్, మధుసుదన్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



గడ్డమేకులపల్లెలో దాడులు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కరపత్రాల ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

బేతంచెర్ల: కర్నూలు జిల్లా పరిషత్ హాలులో జనవరి 3వ తేదీ జరగనున్న సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి కోరారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు మద్దిలేటి, భాను, పెద్దక్క, జయ్యమ్మ పాల్గొన్నారు.

తేజావినయ్‌కుమార్‌రెడ్డికి డాక్టరేట్



బనగానపల్లె: పట్టణంలోని పెండేకంటి నగర్‌కు చెంది న హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి దంపతుల కు మారుడు తేజావినయ్‌కుమార్‌రెడ్డికి డాక్టరేట్ లభించి ంది. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీ సివిల్ ఇంజి నీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ సంజీత్‌కుమార్ పర్యవేక్షణలో ''హైవే ఇంజినీరింగ్ అండ్ ట్రాన్స్‌పర్టేషన్'' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. ఇటీవల జరిగిన కేఎల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గొవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

టైమింగ్.. మారిందోచ్



చీకటి కంటే ముందే వెలుగుతున్న సెంట్రల్ లైటింగ్

సాక్షి ఎఫెక్ట్

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ సమయాన్ని మార్పు చేశారు. శీతాకాలం కావడంతో సాయంత్రం ఆరు గంటల్లోపే పూర్తిగా చీకటి పడుతుండేది. సెంట్రల్ లైటింగ్ సాయంత్రం 6:24 గంటలకు ఆన్ అయ్యేది. టైమర్‌లో మార్పులు చేయకుండా అలాగే ఉంచారు. దీంతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన లైటింగ్ టైమింగ్ మార్చండి అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సాయంత్రం ఆరు గంటల్లోగా ఆన్‌అయ్యేలా, తెల్లవారుజామున ఆరు గంటల దాటాక బంద్ అయ్యేలా టైమ్ సెట్ చేశారు.